# కేంద్రం మరో కోల్ మాల్

> లేని కొరతను కృత్రిమంగా సృష్టిస్తారు. ప్లాంట్లలో వారానికి సరిపడా బొగ్గు నిల్వలు కూడా ఉంచకుండా ఏవేవో కారణాలతో సరఫరాను నిలిపేస్తారు. తీరా.. దేశంలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్నదని గగ్గోలు పెడతారు. ఇదే సమయంలో బొగ్గు కొరత రాకుండా జాగ్రత్తపడాలని విద్యుదుత్పత్తి కంపెనీలకు ఉచిత సలహానిస్తారు. విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలంటూ ఒత్తిడి తీసుకొస్తారు. విదేశీ బొగ్గుపై ఆధారపడి పనిచేసే ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని ఆదేశాలిస్తారు.
>
> **ఎవరి లబ్ధి కోసం కేంద్రంలోని మోదీ సర్కారు ఇదంతా చేస్తున్నదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు కదా!**

- **విదేశీ బొగ్గు ఆధారిత ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేయాలంటూ తాజాగా ఆదేశాలు**
- **వచ్చే జూన్ వరకూ ఇవే నిబంధనలని వెల్లడి**
- **దేశంలో బొగ్గు కొరతే కారణమంటూ వివరణ**
- **కృత్రిమ బొగ్గు కొరత సృష్టించి.. ఆపై నాటకాలు?**
- **ఆప్త మిత్రుడు అదానీకి లబ్ధి చేకూర్చడానికేనా?**
- **అనుమానాలకు బలాన్నిస్తున్న ఇటీవలి పరిణామాలు**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): విదేశీ బొగ్గును దిగుమతి చేసుకొనే విద్యుత్తు ప్లాంట్లన్నీ వచ్చే ఏడాది జూన్ 30 వరకూ పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని కేంద్రంలోని బీజేపీ సర్కారు తాజాగా ఆదేశాలిచ్చింది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌తో పాటు దేశీయ బొగ్గు సరఫరా తగినంతగా లేకపోవడంతోనే ఈ ఆదేశాలిచ్చినట్టు చెప్పుకొచ్చింది. ఈ మేరకు ఎలక్ట్రిసిటీ చట్టం, సెక్షన్ 11 ప్రకారం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం తాజా ఆదేశాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆప్త మిత్రుడు అదానీకి చెందిన కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికే ప్రధాని మోదీ ఇలాంటి ఏకపక్ష విధానాలకు పాల్పడుతున్నట్టు సోషల్ మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

### గత నెలలో ప్రకటనతో షురూ

దేశంలోని థర్మల్ విద్యుత్తు సంస్థలన్నీ తాము వాడే బొగ్గులో విదేశీ బొగ్గును కనీసం 4 శాతం కలుపాలని గత నెలలో కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. దేశంలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు కొరత రాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పుకొచ్చింది. ఈ నిర్ణయంపై ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐసీడబ్ల్యూఎఫ్), ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) యూనియన్ సభ్యులు భగ్గుమన్నారు. దేశంలో బొగ్గు సంక్షోభం ఉందంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఓ కుంభకోణంగా అభివర్ణించారు. దేశంలో అసలు బొగ్గు కొరత ఉన్నదా? లేదా కృత్రిమ కొరత సృష్టించారా? అంటూ కేంద్రాన్ని నిలదీశారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ ఏకపక్ష నిర్ణయంతో వినియోగదారులపై పెను భారం పడే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

### స్కెచ్ అమలు చేశారిలా..

విదేశీ బొగ్గును కనీసం 4 శాతం కలుపాలన్న ప్రకటన వెలువడిన నెల రోజులకు దేశంలో బొగ్గు కొరతను కృత్రిమంగా సృష్టించే వ్యవహారం మొదలైనట్టు విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తూ ఈ నెల రెండోవారంలో దేశంలోని 84 ప్లాంట్లలో బొగ్గు నిల్వలు అడుగంటే పరిస్థితి దాపురించింది. వారానికి అవసరమైన నిల్వలు కూడా లేని దుస్థితి తలెత్తింది. బొగ్గు సరఫరాలో కొందరు అంతరాయాల్ని ఉద్దేశపూర్వకంగానే సృష్టించారన్న విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ, నిల్వలపై కేంద్రం ఏ ప్రకటనా చేయలేదు. మరోవైపు, అక్టోబర్ తొలి మూడు వారాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, పండుగ సీజన్ కావడంతో విద్యుత్తు డిమాండ్ అంతకంతకూ పెరిగిపోయింది. దీని కోసమే ఎదురుచూస్తున్న కేంద్రం.. ఏదో సమస్యను పరిష్కరిస్తున్నట్టు నటిస్తూ.. విదేశీ బొగ్గును దిగుమతి చేసుకొనే విద్యుత్తు ప్లాంట్లన్నీ పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటూ తాజాగా ఆదేశాలిచ్చినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



### విదేశీ బొగ్గు.. లోగుట్టు ఇదే..

దేశంలోని కీలకమైన బొగ్గు గనులే కాదు.. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ అదానీ గ్రూప్‌నకు పెద్ద ఎత్తున బొగ్గు గనులున్నాయి. విదేశాల నుంచి భారత్‌కు అత్యధికంగా బొగ్గు ఎగుమతి చేస్తున్న కంపెనీ కూడా అదానీ గ్రూపుదే. అంతేకాదు.. దేశంలో అత్యధికంగా థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న కంపెనీ, బొగ్గును సరఫరా చేసే ప్రైవేట్ రైల్వే ర్యాక్స్ వ్యవస్థ కూడా అదానీదే. థర్మల్ విద్యుత్తు సంస్థలన్నీ తాము వాడే బొగ్గులో కనీసం 4 శాతం విదేశీ బొగ్గు కలుపాలని ఆదేశించటం, వచ్చే జూన్ 30 వరకు ఆయా కంపెనీలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని కేంద్రం పేర్కొనడం.. అదానీ గ్రూప్‌నకు సిరులు కురిపించడానికేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కుటుంబానికి తెలియకుండా వంద కోట్ల ఆస్తి విక్రయం!

ముంబై: ముంబైలోని ఒక మహిళ సహ యజమాని అయిన తన సవతి సోదరునికి తెలియకుండా ఏకంగా రూ.100 కోట్ల విలువైన ఫ్లాట్‌ను అమ్మేసింది. బాధితుని ఫిర్యాదు మేరకు ఆ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబైలోని అతి ఖరీదైన లోయర్ పారెల్ ప్రాంతంలో ఉన్న ఫ్లాట్‌ను అబిదా ఇస్మాయిల్ తన సవతి సోదరుడు అయాజ్ కపాడియాకు తెలియకుండా రూ.100 కోట్లకు అమ్మేసింది. వాస్తవానికి ఆ ఫ్లాట్ కపాడియా దివంగత తండ్రి జాఫర్ కపాడియా, అతని సోదరుడు లతీఫ్ కపాడియా పేరుపై ఉంది. అయితే ఇటీవల లతీఫ్ కుమార్తె, కుటుంబ సభ్యులు నకిలీ పత్రాలు సృష్టించి అమ్మేశారు.

## రామమందిర ప్రారంభానికి మోదీకి ఆహ్వానం

న్యూఢిల్లీ: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. జనవరి 22న అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగనుంది. బుధవారం ఢిల్లీలో ప్రధానిని కలిసిన ట్రస్ట్ సభ్యులు.. మందిర ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు.



# ఐస్‌ల్యాండ్ ప్రధానమంత్రి సమ్మె

- **సమాన వేతనం కోసం నినదించిన మహిళలు**
- **విధులు బహిష్కరించి మద్దతు ప్రకటించిన ప్రధాని**


కట్రిన్

రేజావిక్, అక్టోబర్ 25: సమాన వేతనం చెల్లించకుండా మహిళల పట్ల చూపుతున్న వివక్షకు నిరసనగా ఐస్‌ల్యాండ్ దేశంలోని మహిళలు మంగళవారం సమ్మెకు దిగారు. వారికి సంఘీభావంగా సాక్షాత్తు దేశ ప్రధాని కట్రిన్ కూడా సమ్మెలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా తాను మంగళవారం విధులు నిర్వహించ లేదని చెప్పారు. 'దేశంలో వేతన చెల్లింపు, లింగ వివక్షకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నాను. అందుకే విధులకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉన్నాను' అని ఆమె ప్రకటించారు. ఇంకా పని ప్రదేశాల్లో సమాన వేతనం పొందే విషయంలో లింగ వివక్షను ఎదుర్కొంటున్నామని, 2023లో కూడా ఇది కొనసాగడం వాంఛనీయం కాదన్నారు.

# ఎరువుల సబ్సిడీకి కేంద్రం కోత

మొదటిపేజీ తరువాయి...

రూ. 22,303 కోట్ల విడుదలకు ఆమోద ముద్ర వేసింది. రైతులకు సులభంగా, అందుబాటు ధరల్లో ఎరువులు అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదంటూ ఎప్పటిలాగే సవతి తల్లి ప్రేమను కురిపించింది. అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని రైతులపై మోపట్లేదని, ఎరువుల ధరలు ఎంతమాత్రం పెంచట్లేదని పనిలో పనిగా మొసలి కన్నీరు కార్చింది.

### కిందటిసారితో పోల్చిచూస్తే..

నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులకు గతంలో ఇస్తున్న సబ్సిడీ కేటాయింపులతో పోలిస్తే, ఈసారి కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ఎంతలా అంటే, గత యాసంగి పంట సీజన్‌కు (అక్టోబర్ 1, 2022-మార్చి 31, 2023) సబ్సిడీ vకింద రూ. 51,875 కోట్లను కేటాయిస్తే, ఈ సారి రూ. 22,303 కోట్లు (57 శాతం కోత) మాత్రమే కేటాయించారు. అంతేకాదు.. ఒక వైపు అంతర్జాతీయంగా ఈ ఎరువుల ధరలు తగ్గుతున్నప్పటికీ, ఆ విషయాన్ని దాచిపెడుతున్న కేంద్రం.. ఎరువుల ధరలు పెరుగుతున్నట్టు అబద్ధాలకు దిగింది. అలా.. గ్లోబల్ మార్కెట్లలో తక్కువ ధరకు ఎరువులు లభిస్తున్నప్పటికీ, రేట్లను తగ్గించకుండా.. ఆ ఆర్థిక ప్రయోజనాలు అన్నదాతలకు అందకుండా ఖజానాకు మళ్లిస్తున్నది.

### కొరత సృష్టించడానికి యత్నాలు..

దేశ ఆర్థిక వ్యవస్థకు ఇప్పటికీ వ్యవసాయరంగమే ఆయువుపట్టు. రైతుల్లో 95 శాతం చిన్న, సన్నకారు రైతులే. వీరిపై ఎరువుల భారం పడకుండా చూసేందుకు ప్రభుత్వాలు ఎరువులను సబ్సిడీపై అందిస్తున్నాయి. కొన్నేండ్లుగా దేశంలో సాగుభూమి విస్తీర్ణం పెరగటంతోపాటు, వాణిజ్య పంటల సాగు కూడా పెరగటంతో రసాయనిక ఎరువుల వాడకం కూడా పెరిగింది. దానితోపాటే ప్రభుత్వం ఎరువులపై ఇస్తున్న సబ్సిడీ పెంచాల్సిన అవసరమున్నది. కానీ, బీజేపీ సర్కారు ఆ విషయాన్ని వదిలేసి ఎరువుల సబ్సిడీ భారాన్ని వదిలించుకోవటం గురించే ఆలోచిస్తున్నది. ఇందులో భాగంగానే, సేంద్రియ సాగును ప్రోత్సహించే 'పీఎం ప్రణామ్' పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే యాసంగి సీజన్ ఎరువులపై ఇచ్చే సబ్సిడీకి కేంద్రం 57% కోత విధించడం గమనార్హం. ఇక, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై మొత్తంగా సబ్సిడీ రూ. 2.54 లక్షల కోట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం దీన్ని రూ. 1.75 లక్షల కోట్లకు తగ్గిస్తున్నట్టు గత ఫిబ్రవరిలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ నివేదిక ద్వారా అర్థమవుతున్నది. అంతేకాదు, ఎరువులు దొరక్కపోవడంతో మధ్యప్రదేశ్, యూపీ తదితర రాష్ట్రాల్లో లైన్లలోనే నిలబడి రైతన్నలు ప్రాణాలు విడిచిపెడుతుండటం దేశంలో ఎరువుల 'కృత్రిమ' కొరతకు తార్కాణాలు. భారత్‌లాంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యంకాని 'ప్రణామ్' స్కీమ్‌ను ప్రోత్సహించడానికే కేంద్రం ఈ విధంగా చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# హమాస్‌పై ఐరన్ స్టింగ్

- **ఇజ్రాయెల్ సరికొత్త ఆయుధం**
- **గాజాపై మళ్లీ వైమానిక దాడులు.. వందలాది మంది దుర్మరణం**

టెల్‌అవీవ్, వాషింగ్టన్, అక్టోబర్ 25: హమాస్‌తో జరుగుతున్న యుద్ధంలో మరో సరికొత్త అస్త్రాన్ని ఇజ్రాయెల్ రంగంలోకి దించింది. ఐరన్‌డోమ్, ఐరన్‌బీమ్ తర్వాత ఇప్పుడు ఐరన్ స్టింగ్ వ్యవస్థను బయటకు తీసింది. గాజా స్ట్రిప్‌లో జనావాసాల మధ్య నుంచి రాకెట్లను ప్రయోగించే లాంఛర్లను ధ్వంసం చేయడానికి పది రోజుల కిందటి నుంచే దీన్ని ప్రయోగిస్తున్నది. ఐరన్ స్టింగ్ అనేది అధునాతన మోర్టార్ బాంబ్. అత్యం త కచ్చితత్వంతో ఇది లక్ష్యాలను ఛేదించగలదు. దీనిలో గైడెడ్ వ్యవస్థ ఉన్నది. 12 కిలోమీటర్ల పరిధి వరకు దీన్ని ప్రయోగించవచ్చు. అత్యధిక జనాభా ఉన్న ప్రాంతాల్లోనూ కచ్చితత్వంతో లక్షిత దాడులు నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

### గాజాపై దండయాత్రకు సిద్ధమే

గాజాపై దండయాత్రకు సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సరైన సమయం కోసం వేచిచూస్తున్నట్టు పేర్కొన్నది. మంగళవారం గాజాపై 400 వైమానిక దాడులు చేశామని ప్రకటించింది. ఈ దాడుల్లో వందలాది మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా వైద్య శాఖాధికారులు వెల్లడించారు.

## హమాస్ దాడి ఒక్కసారిగా జరిగింది కాదు: గుటెరస్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ఒక్కసారిగా జరిగింది కాదని, 56 ఏండ్లుగా పాలస్తీనీయులు అణచివేతకు గురవుతున్నారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. రెండు దేశాల ఏర్పాటే సమస్యకు పరిష్కారమని పేర్కొన్నారు. గుటెరస్ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని గుటెరస్ వివరణ ఇచ్చారు.


